సాక్షి

అన్నమయ్య జిల్లా

శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

రాజంపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది నిబద్ధతో పనిచేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. -IIలో



ఎర్రచందనం దుంగలు పట్టివేత

రైల్వేకోడూరు అటవీశాఖ పరిధిలో తమిళనాడుకు చెందిన వెంకటేశన్ దుంగలు తరలిస్తూ కనిపించాడు. అతడిని అరెస్టు 24 దుంగలను అధికారులు స్వాధీనం చేసున్నారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.200	రూ.250
రెండోరకం	రూ.140	రూ.190

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 154 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	644	660
బైవోల్టిన్	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 239.700 కిలోలు

న్యూస్‌రీల్

నేడు జాబ్ మేళా

మదనపల్లె సిటీ: స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి దాసరి నాగార్జున తెలిపారు. జాబ్‌మేళాకు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9553202509, 6301612761 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు ఆకేపాటి ఎస్టేట్‌లో ఎస్సీ సెల్ సమావేశం

రాజంపేట: రాజంపేట మండలం ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ విభాగం విస్తృత స్థాయి సమావేశం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగనుంది. ఈ విషయాన్ని విభాగం జిల్లా అధ్యక్షుడు రంగాల కమలాకర్ శుక్రవారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎస్సీ జిల్లా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. సమావేశానికి ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పీజే సుధాకర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారన్నారు. ఎస్సీసెల్ విభాగంలో వివిధ హోదాలలో ఉన్న ఎస్సీసెల్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పరస్పర సహకారంతో జిల్లా అభివృద్ధి



కలెక్టరేట్‌లో సమావేశమైన కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్ కనుబిల్లి

రాయచోటి: జిల్లా అభివృద్ధి విషయంలో పరస్పర సహకారంతో ముందుకు సాగుతామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్, ఎస్పీలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి సమావేశమయ్యారు. జిల్లా అభివృద్ధి, చట్ట వ్యవస్థ బలోపేతం, ప్రజాసేవలో పరస్పర సహకారంపై చర్చ, జిల్లా పోలీసు, రెవెన్యూ విభాగాల మధ్య సమన్వయం పెంపొందించుకోవాలన్న ఆత్మీయత, ప్రజల శ్రేయస్సుకోసం కలిసి కృషి చేయాలన్న సంకల్పం తదితర విషయాలపై చర్చించుకున్నట్లు తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీతో జిల్లా పరిపాలనలో నూతనోత్సాహం, సమన్వయం మరింత బలపడుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ శిఖరాగ్ర సభకు ఉపాధ్యాయుడు

కడప ఎడ్యుకేషన్: న్యూఢిల్లీలో ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జీ20 శిఖరాగ్ర సభకు కడప గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన గణిత ఉపాధ్యాయుడు సురేష్ వెళ్లి పాల్గొన్నారు. న్యూఢిల్లీ భారత మండపంలో ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగిన జీ20 శిఖరాగ్ర సమావేశంలో సుమారు 100 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. 59వ ఇంటర్నేషనల్ ఎలక్ట్రో టెక్నికల్ కమిషన్ (ఐఈసీ) జనరల్ మీటింగ్, ఎక్స్‌పోలో పాల్గొనుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అకడమిక్ డెలిగేట్‌గా కడప గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు బి.సురేష్‌కు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎ) ఏపీ విజయవాడ బ్రాంచ్ నుంచి ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆయన ఐఈసీ-2025 జనరల్ మీటింగ్‌కు వెళ్లి పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్లు సమర్పించాలి



మాట్లాడుతున్న డీఈఓ సుబ్రమణ్యం

రాయచోటి: విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే నూతన ఆవిష్కరణల పోటీలకు సంబంధించి ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్‌లను శనివారం సాయంత్రంలోపు సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయలకు సూచించారు. రాయచోటిలోని డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇన్‌స్పైర్ హెల్ప్ డెస్కును శుక్రవారం మధ్యాహ్నం సందర్శించారు. దసరా సెలవులు వస్తున్నందున జిల్లాలోని అన్ని పెండింగ్ పాఠశాలలు శనివారం సాయంత్రంలోపు విద్యార్థులతో ఆన్‌లైన్‌లో నామినేషన్లు సమర్పించాలని డీఈఓ తెలియజేశారు. అలా చేయని వారు సెలవు రోజుల్లో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాలన్నారు. ఆరు నుంచి పన్నెండు తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న అన్వేషణాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, సైన్స్ రిసోర్స్ పర్సన్ రంజిత్ నాయక్ పాల్గొన్నారు.

ప్రజల ఆస్తి



ప్రభుత్వ ఆధ్వర్యంలో వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన మదనపల్లె వైద్యకళాశాల జగన్ ఆస్తికాదు, ప్రజల ఆస్తి. ఇప్పటిదాకా ఎంత నిర్మాణం పూర్తయ్యిందో.. మిగిలిన పనులను ప్రస్తుత ప్రభుత్వం బాధ్యతగా పూర్తి చేయాలి. దీనిని విస్మరించి చంద్రబాబు బినామీలైన కార్పొరేట్ సంస్థలకు వైద్యకళాశాలను అప్పగించి అమ్మేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధం కావడం దుర్మార్గం. జగన్ చెప్పినట్టు కళాశాలను ఎవరు తీసుకున్నా తమ ప్రభుత్వం వచ్చాక మళ్లీ ప్రభుత్వపరం చేస్తాం.

-ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు

అడుగుపెట్టనివ్వం



మదనపల్లె వైద్య కళాశాల టెండర్లలో ప్రైవేటు వ్యక్తులు పాల్గొని ఎవరు టెండర్ దక్కించుకున్నా కళాశాల ఆవరణలోకి అడుగుపెట్టనివ్వం. కూటమి పాలనలో జలవనరుల పరంగా ప్రాజెక్టులను కోల్పోయిన ప్రజలు ఇప్పుడు పేదలకు వరమైన వైద్య కళాశాలను పోగొట్టుకునే పరిస్థితుల్లో లేరు. ఉద్యమాలు, ఆందోళనలు చేసైనా వైద్య కళాశాలను కాపాడుకుంటాం. వైద్య కళాశాల ఎదురుగానే ఆరోగ్యవరం ఉంది. ఇలాంటి ప్రాంతంలోని కళాశాలను ప్రైవేట్‌కు ఇవ్వడం దుర్మార్గం.

-పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే

ఎకరం రూపాయికేనా



మదనపల్లె వైద్యకళాశాల 95 ఎకరాల కోట్ల విలువైన భూమిని ఎకరం ఒక రూపాయికి కట్టబెట్టి ద్రోహానికి పాలప్పడుతున్నారు. రూ.80 కోట్ల పనులు పూర్తయిన భవనాలను నిర్లక్ష్యం చేయడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రజలు వద్దంటున్నా టెండర్లను పిలిచి ప్రజల సొమ్మును దోచుకోంటున్నారు. వేలమందికి వైద్యం అందించే కళాశాలను ప్రైవేట్‌కు ఇవ్వడంపై కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకుంటుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో కళాశాలల నిర్వహణ చేపట్టాలి.

- గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ధనికులకే విద్య



మదనపల్లెకు వరమైన వైద్య కళాశాలను ప్రైవేట్‌కు ఇవ్వడం ద్వారా ధనికులకే వైద్య విద్యను పరిమితం చేస్తున్నారు. పేదలు వైద్య విద్యకు దూరం అవుతారు. చంద్రబాబు బినామీలకు కట్టబెట్టే ప్రయత్నాలు విరమించి ప్రభుత్వ ఆధ్వర్యంలో కళాశాలల నిర్వహణ చేపట్టాలి. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు కార్పొరేట్ వైద్యం, పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు దక్కాలన్న లక్ష్యంతో కళాశాలలను ప్రారంభించారు. వీటిద్వారా కూటమి ప్రభుత్వం దోచుకునే కుట్ర చేస్తోంది.

-దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

మెడికలపై ఉక్కుపిడికిలి





మదనపల్లె మెడికల్ కళాశాల ప్రధాన భవనం వద్ద బైఠాయించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, విద్యార్థులు, నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు ఆకేపాటి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, నిసార్, శ్రీకాంత్‌రెడ్డి, తిప్పారెడ్డి, నరేషకుమార్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి తదితరులు

కదం తొక్కిన విద్యార్థి లోకం

- 'చలో మెడికల్ కళాశాల' విజయవంతం
- ప్రైవేటీకరణపై వెల్లువెత్తిన నిరసన

మదనపల్లె: సీఎం చంద్రబాబు పేద విద్యార్థుల వైద్యవిద్య కలపై ఉక్కుపిడికిలి బిగిస్తున్నారని, దేశంలోని మెడికల్ కళాశాలల్లో ఎక్కడా పీపీపీ విధానం లేదని, చంద్రబాబు చెబుతున్న నిధుల కొరత కథ అంతా నాటకమేనని వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నేతలు ధ్వజమెత్తారు. మదనపల్లె ప్రభుత్వ వైద్యకళాశాల ప్రైవేటీకరణను నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో చలో మదనపల్లె మెడికల్ కళాశాల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నేతలు పాల్గొని, మాట్లాడారు. చంద్రబాబు హయాంలో ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేయలేదని, ఒక మెడికల్ సీటు పెంచలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో రాష్ట్రంలో 2,550 మెడికల్ సీట్లు వస్తుండగా వాటిపై కూటమి నేతల దుష్ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. వైద్యకళాశాలల ప్రైవేటీకరణతో పేద, మధ్య తరగతికి విద్యార్థులు వైద్యవిద్యకు దూరం కావడమే కాకుండా, పేదలకు ఉచిత సేవలు దూరం అవుతాయని ఆవేదన చెందారు. వైద్య కళాశాలల పీపీపీ ప్రక్రియను తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

చలో మదనపల్లె మెడికల్ కళాశాల భారీ సక్సెస్

ప్రభుత్వ వైద్యవిద్య పరిరక్షణే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో మదనపల్లె మెడికల్ కళాశాల కార్యక్రమం భారీ సక్సెస్ అయ్యింది. వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిరసన జ్వాలలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు, విద్యార్థి విభాగం, యువజన విభాగం నేతలు మాట్లాడుతూ అయినవారికి దోచిపెట్టడమే చంద్రబాబు నైజమని మండిపడ్డారు. పేదింటి బిడ్డలకు వైద్యవిద్య భారం కాకూడదని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 నూతన వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారని చెప్పారు. అందులో భాగంగానే అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రూ.470 కోట్లతో 95 ఎకరాల్లో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారని చెప్పారు. చాలా వరకూ భవన నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు ఆగిపోయాయని అన్నారు. ఏడాదిన్నరగా పనులు సాగలేదని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే రాష్ట్రంలో ఐదు మెడికల్ కళాశాలలను ప్రారంభించారన్నారు. ఆ సమయంలోనే ఎన్నికలు రావడం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందన్నారు. పేదల ఆశలపై నీళ్లు చల్లుతూ సీఎం చంద్రబాబు 'పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్‌షిప్'(పీపీపీ) విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారని చెప్పారు. రాష్ట్రంలో 10 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే చర్యలకు ఉపక్రమించారని తెలిపారు. ప్రైవేట్ చేతుల్లోకి మెడికల్ కళాశాలలు వెళితే పేద విద్యార్థులు ఆ వైద్య కళాశాలల గుమ్మం ఎక్కలేని పరిస్థితి తలెత్తనుండడంతోపాటు వైద్యం ఖరీదవుతుందని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో మదనపల్లె మెడికల్ కాలేజ్' కార్యక్రమం భారీ సక్సెస్ అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ రెడ్డి, మదనపల్లె ఇన్‌చార్జ్ నిస్సార్ అహమ్మద్, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, పుంగనూరు నియోజక వర్గ నేతలు శ్రీనాథరెడ్డి, అనూషరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు భూమన అభినయ్ రెడ్డి, విద్యార్థి విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు జంగంరెడ్డి కిషోర్ దాస్, రాష్ట్ర ప్రచార అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, పరిశీలకురాలు ఎస్.ఆనీషా రెడ్డి, ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.హరినాథరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జి.షమీంఅస్లాం, మున్సిపల్ చైర్మన్ వి.మనూజ, 17 నియోజకవర్గాల నేతలు పాల్గొన్నారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న మెడికల్ కళాశాల భవనాలను వైఎస్సార్ సీపీ నేతలు శుక్రవారం పరిశీలించారు.

ప్రధాన భవనం వద్ద బైఠాయింపు

నిర్మాణదశలో ఉన్న ప్రధాన భవనం వద్ద విద్యార్థులు, యువకులతో కలసి వైఎస్సార్ సీపీ నేతలు బైఠాయించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పేదల కలలు- ప్రభుత్వ కళాశాలలు, పేదలకు దూరంగా వైద్యం.. బాబు బినామీలకు నైవేద్యం అని నినాదాలు చేశారు.



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి, యువజన విభాగం శ్రేణులు

భవిష్యత్తును కాలరాస్తున్న కూటమి



ప్రజల భవిష్యత్తును కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. 17 మెడికల్ కాలేజీలనిర్మాణం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.8,500 కోట్లు ఖర్చు చేయగా ఇంకా రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తే పనులు పూర్తవుతాయి. ఈ నిధులు ఖర్చు చేయడం భారమని ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పుకుని ప్రైవేట్‌కు ఇవ్వాలని ప్రజలను మభ్యపెడుతోంది.

-భూమన అభినయ్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

ఉద్యమాలతో అడ్డుకుంటాం



జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల కోసం 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపడితే వాటిని కొనసాగించాల్సిన చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పగించే దారుణమైన నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియను ఉపసంహరించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టి అడ్డుకుంటాం.

-చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరుజిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు

ఒక్క కళాశాల తేలేదు



40 ఏళ్ల రాజకీయ చరిత్ర అని చెప్పుకునే చంద్రబాబు ఒక్క మెడికల్ కళాశాల కూడా తేలేదు జగన్ 17 కాలేజీలు మంజూరు చేసి 5 ప్రారంభిస్తే.వాటిని ప్రైవేట్‌కు ఇవ్వడంలో ఉద్దేశం ఏమిటి. ప్రైవేటీకరణను ఆపడానికి చర్య లు చేపట్టాలి. -శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి

ప్రజలు క్షమించరు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్.జగన్ తీసుకున్న వైద్య విధానం కారణంగా ఎంతో మంది పేదలకు మేలు జరిగింది. ఆయన చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాలలప్రైవేటీకరణకు చంద్రబాబు పూనుకోవడం దారుణం. దీన్ని ప్రజలు క్షమించరు.-ఎస్.శ్రీనాథ్‌రెడ్డి,వైఎస్సార్‌సీపీ నాయకుడు

పేదలపై కక్షతోనే...



పేదలపై కక్షతోనే మదనపల్లె వైద్య కళాశాలను ప్రైవేట్‌కు అప్పగిస్తున్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి కష్టపడి ఇక్కడ కళాశాలను తీసుకొచ్చారు. రూ.475 కోట్లతో నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేసే సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రైవేట్‌కు ఇస్తోంది. దీనికి వ్యతిరేకంగా ప్రజలతో కలిసి నిర్ణయం ఉపసంహరించుకునే దాక పోరాటం చేస్తాం.

-నిసార్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త

బ్రిటీషర్లు గుర్తించారు



వైద్యపరంగా బ్రిటీషర్లు మదనపల్లెను గుర్తించి ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పుడు మదనపల్లెకు వైద్యకళాశాల ఇచ్చి వైఎస్.జగన్ గుర్తింపు తెచ్చారు. వైద్యం కోసం పేదలు తిరుపతి, బెంగళూరుకు వెళ్తున్నారు. సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్న మదనపల్లె వైద్య కళాశాలను ప్రైవేట్‌కు ఇవ్వడం ద్వారా ఇక్కడి ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారు. ఈ చర్యలను ఉపసంహరించుకోవాలి.

-బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ

పదేళ్లకే కూలిపోతుందా



మట్టితో కట్టిన మిద్దె వందేళ్లు మన్నిక వస్తుంటే.. వైద్య కళాశాల భవనాలు పదేళ్లకే కూలిపోతాయని అసెంబ్లీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చెప్పడం ప్రజల్లో చులకన కావడమే. వైద్య కళాశాలను ప్రైవేట్‌పరం చేస్తే చీటిరాసినా డబ్బు చెల్లించాల్సిందే. రాష్ట్రం ముందుకు వెళ్లాలన్న లక్ష్యంతోనే వైద్య కళాశాలలను ప్రారంభించారు. దీన్ని కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతోంది.

-జీ.షమీంఅస్లాం, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్

అమ్మకానికి ఆరోగ్యం



కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని అమ్మకానికి పెట్టింది. లోకేష్ బినామీలకు ప్రభుత్వ ఆస్తులను దోచిపెడుతున్నారు. 15 ఏళ్ల చంద్రబాబు పాలనలో ప్రభుత్వ వ్యవస్థలను బలహీనపర్చారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడం ద్రోహం. ప్రజా వ్యతిరేక చర్యలపై తుదిదాకా పోరాటం చేస్తాం.

-వి.హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

ప్రభుత్వం ఏం చేస్తుంది



పేదలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిపే వైద్య కళాశాలను ప్రైవేట్ పరం చేస్తే ఇక ప్రభుత్వం ఏం చేస్తుంది. పేదలకు తీరని ద్రోహం చేసే చర్యలను అడ్డుకుంటాం. చంద్రబాబు పాలనా కాలం చూస్తే ఆయన సేవలన్నీ ప్రైవేట్‌కే దారాదత్తం చేశారు. వైద్య విద్య, వైద్యంపై కక్షకట్టి కళాశాలలతోపాటు కోట్ల విలువైన ఆస్తులను అప్పగించేస్తున్నారు.

-వి.మనూజ, మున్సిపల్ చైర్‌పర్సన్

ముంచెత్తిన వాన

- ములకలచెరువులో 256 మి.మీ వర్షం
- పొంగుతున్న వాగులు
- రాయచోటిలో ఇంటిపై పడిన పిడుగు.. తప్పిన ప్రాణ నష్టం



పెద్దమండ్యం: ప్రవహిస్తున్న కుషావతీ నది

రాయచోటి: అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా మూడురోజులుగా వర్షాలు దంచి కొడుతున్నాయి. గురువారం అర్ధరాత్రి అనంతరం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. రాయచోటిలోని ఎస్‌జీఓ కాలనీలో నివాసం ఉంటున్న మధుసూదన్ రెడ్డి ఇంటిపై పిడుగు పడింది. దీంతో గోడలు దెబ్బతిన్నాయి ఇంటిలోపలకు పిడుగుచొచ్చుకొని వె ళ్లింది. అయితే ఎవరికీ గాయాలు కాలేదు. వర్షాలకు తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ములకల చెరువు, పెద్దతిప్ప సముద్రం, కొత్తకోట, పెద్దమండెం మండలాల్లోని చెరువులన్నీ నిండాయి. సుండుపల్లిలోని పింఛా ప్రాజెక్టులనుండి నదుల్లోకి ప్రవాహం సాగుతోంది.

తెగిన చెరువుకట్ట...దెబ్బతిన్న రహదారి.....

గురువారం రాత్రి కురిసిన వర్షానికి సుండుపల్లి మండల పరిధిలోని అయ్యవారి చెరువు కట్ట తెగిపోవడంతో సమీపంలోని వాగులు, వంకలు, నదులు ఉధృతంగా ప్రవహించాయి. రాయచోటి- పింఛా మార్గంలోని బహుదా నదిపై నిర్మించిన రహదారి తెగిపోయింది. దీంతో ఆయా గ్రామాలకు మండల కేంద్రమైన సుండుపల్లితో రవాణా ఆగిపోయింది. శుక్రవారం ఉదయానికి జిల్లాలోని ములకల చెరువులో 256 మిల్లీ మీటర్ల మేర అత్యధిక వర్షపాతం నమోదైంది. పెద్ద తిప్ప సముద్రంలో 163.6, బి కొత్తకోటలో 75.4, పెద్దమండెంలో 69.6, గాలివీడు 60.8, పెనగలూరు 58.6, వీరబల్లి 55.4, తంబళ్లపల్లి 49.2, సుండుపల్లి 46.2, రాయచోటి 406., రామాపురం 40.2, వాల్మీకిపురం 32.6, రామసముద్రం 29, మదనపల్లి 28.2, కురబలకోట 28, కలికరి 25, చిన్న మండెం 20., కలకడ 18.8, నిమ్మనపల్లి 15.4, సంబేపల్లి 13.4, నందలూరు 10.4, కెవిపల్లి 12.2 మిల్లీమీటర్ల వంతున వర్షపాతం నమోదైంది. పుల్లంపేట, ఓబులవారిపల్లి, కోడూరు మండలాల్లో చుక్క వర్షపాతం నమోదు కాలేదు. జిల్లాలో శుక్రవారం రాత్రి 7 గంటల నుంచి భారీ వర్షం కురుస్తోంది. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తుండటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.

పెనగలూరు: మండలంలో చెయ్యేరు నది నీరు ప్రవహించడంతో పల్లంపాడు గ్రామానికి గురువారం రాత్రి నుంచి రాకపోకలు నిలిచిపోయాయి.

నిలిచిపోయిన రాకపోకలు

పెద్దమండ్యం: వర్షానికి పెద్దమండ్యంలో కుషావతీ నది ప్రవాహంతో శుక్రవారం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.మదనపల్లె- గాలివీడు మార్గంలో తిరిగే ఆర్‌టీసీ బస్సులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. ఉదయం పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాల వేళలో నది ప్రవాహంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.



రాయచోటి - పింఛా మార్గంలో తెగిపోయిన రోడ్డు



పెనగలూరు: పల్లంపాడు గ్రామానికి వెళ్లే రోడ్డుపై ప్రవహిస్తున్న చెయ్యేరు నీరు

సుండుపల్లె: మండలంలోని చెరుకువాండ్లపల్లి లోని అయ్యవారి చెరువు కట్ట తెగిపోవడంతో నీరు రోడ్డు మీదకు చేరింది. దీంతో రాయచోటి- పింఛా ప్ర ధాన రహదారి దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయి.

క్లుప్తంగా

శివాలయంలో... చోరీ

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం పట్టణ పరిధిలోని శివాలయంలో గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. స్థానికుల వివరాల మేరకు... పట్టణంలోని నిమ్మనపల్లి రోడ్డులో శివాలయం ఉంది. రాత్రి ఆలయంలో ప్రవేశించిన గుర్తుతెలియని దుండగులు ఆలయ గేటు తాళాలు పగులగొట్టి, సీసీ కెమెరాలకు కనెక్షన్ తొలగించారు. హుండీలోని నగదు, స్వామి వెండి కిరీటం దోచుకెళ్లారు. శుక్రవారం ఉదయం వాచ్‌మెన్ శ్రీనివాసులు గమనించి ఆలయ నిర్వాహకులు వెంకటరెడ్డికి తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన సుభద్రమ్మ

రాయచోటి : పట్టణంలోని మాసాపేటలో సుగవాసి సుభద్రమ్మ(60) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం ఉదయం ఇంటిలో ఎవరూలేని సమయంలో వరండాలో కడ్డీకి చీరతో ఉరివేసుకున్నట్లు తెలిపారు. సుభద్రమ్మ భర్త మృతిచెందగా ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గత కొద్దిరోజులుగా సుభద్రమ్మ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికుల సమాచారం. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఆర్థికంగా ఇబ్బందులు నెలకొనడంతో ఈ పరిస్థితులు తలెత్తాయని పోలీసులకు అందిన సమాచారం. సమచారం అందుకున్న రాయచోటి పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసి సుభద్రమ్మ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని స్కూల్ వాచ్‌మెన్ మృతి


శ్రీనివాసులు (ఫైల్)

మదనపల్లె రూరల్ : కారు ఢీకొని స్కూల్ వాచ్‌మెన్ మృతిచెందిన సంఘటన మదనపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. బసినికొండ పంచాయతీ నిమ్మనపల్లె రోడ్డులో నివాసముంటున్న శ్రీనివాసులు(60) స్థానిక హైస్కూల్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అతడికి భార్య అమరావతి, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. మనవరాలు తరుణికను స్కూల్ నుంచి ఇంటికి తీసుకు వచ్చేందుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. బాలికను తీసుకుని తిరిగి బైపాస్‌రోడ్డులో ఇంటికి వస్తుండగా, సాయిబాబా ఆలయ సమీపంలో వేగంగా వచ్చిన కారు ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలోకి వెళ్లగా, తరుణిక స్వల్పంగా గాయపడింది. గమనించిన స్థానికులు వారిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో శ్రీనివాసులు చికిత్సలు పొందుతూ మృతి చెందాడు.

వైద్య విద్యను ప్రైవేటీకరించడం ప్రమాదం

కడప రూరల్ : వైద్య రంగాన్ని ప్రైవేటుపరం చేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని డాక్టర్ నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో ప్రభుత్వ విద్య ప్రైవేటీకరణ..లాభ–నష్టాలు అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల ద్వారా విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు, రోగులకు సేవలందించడం ద్వారా వైద్య రంగంలో మెలకువలు తెలుసుకునేందుకు పేద విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేసే పీపీపీ విదానాన్ని ఉత్తరాఖండ్, గోవా, కర్ణాటక, తమిళనాడు, కేరళలో వ్యతిరేకించారని తెలిపారు. రాష్ట్రంలో పది మెడికల్ కళాశాలలుండగా, ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయడం తగదన్నారు. 66 ఏళ్లకు కోట్ల రూపాయల ఆస్తులను రూ.5వేలకు లీజుకు ఇవ్వడం శోచనీయమని తెలిపారు. డాక్టర్ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేటుపరం చేయడం ద్వారా సీట్లను అమ్ముకుని వైద్య విద్యను వ్యాపారం చేయడమేనని తెలిపారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రైవేటీకరణ విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు స్థాయిలో వ్యతిరేకిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ సామేల్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నాగార్జునరెడ్డి

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు



పులివెందులలో అన్ని హంగులతో మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. ఈ కాలేజీలు ప్రైవేటుపరం చేయాలనుకోవడం దారుణం. ప్రైవేటీకరణతో విద్యాబోధన సక్రమంగా ఉండదు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ ఎస్.గౌస్‌పీర్, కడప

ప్రభుత్వ నిర్ణయం మంచిది కాదు



ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా ప్రయోజనకరంగా ఉండాలి. వైద్య విద్య కాలేజీల ప్రైవేటుపరం చేయడంతో సిబ్బందితోపాటు మౌలిక సదుపాయాలు ఉండవు. అలాగే అక్కడికి వచ్చే రోగుల ద్వారా నైపుణ్యాన్ని పెంచుకోవాల్సి ఉంటుంది. అక్కడ రోగుల సంఖ్య చాలా తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ బాలిరెడ్డి, కడప

వైద్య విధానంలో రాజకీయం తగదు



రోగులకు సేవలందించే కీలకమైన వైద్య విధానంలో రాజకీయాలు తగవు. ఏవైనా నిర్ణయాలు తీసుకునేటపుడు వైద్యులు, ఇతర విద్యార్థులు, తదితర సంస్థలకు, ప్రజలకు ప్రయోజనకరంగా ఉండేలా పాలకులు చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ రామచంద్రయ్య, కడప

ప్రైవేటుపరం వెనుక అవినీతి ముసుగు



వైద్య విద్యను ప్రైవేటుపరం చేయడం ద్వారా అవినీతి ముసుగు ఉంది. వైద్యులతో పాటు కీలకమైన పారా మెడికల్ స్టాఫ్‌ను పెంచాలి. కడపలో కేన్సర్ ఆస్పత్రి ఉంటే ప్రభుత్వం ఇంతవరకు అక్కడ సిబ్బంది, సౌకర్యాలను కల్పించకపోవడం శోచనీయం.

– డాక్టర్ రాంగోపాల్‌వర్మ, కడప

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాజంపేట : రాజంపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది నిబద్ధతో పనిచేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిపాలనలో సమస్య గుర్తించి పరిష్కరించే విధంగా పాలన సాగాలని పేర్కొన్నారు. చెత్త సేకరణ, ప్రజారోగ్యంపై మున్సిపల్ కమిషనర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నీటి సరఫరాపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం పంటలు, వాటి విస్తీర్ణం వివరాలు వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ హెచ్.భావన, రాజంపేట నియోజకవర్గ ఎంఆర్‌ఓలు, ఎంపీడీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు ఆర్‌ఎంపీ క్లినిక్‌లు సీజ్

దువ్వూరు : నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నాలుగు ఆర్‌ఎంపీ క్లినిక్‌లను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.మల్లేష్ శుక్రవారం సీజ్ చేశారు. డాక్టర్ వి.మల్లేష్ మాట్లాడుతూ ఆకస్మిక తనిఖీల్లో పరిమితికి మించి రోగులకు చికిత్స అందిస్తున్నట్లు తేలిందని, యాంటిబయోటిక్స్, సెలైన్ బాటిల్స్‌తోతమ పరిధికి మించి వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. అర్హతలు, అనుమతులు లేకుండా ఇలాంటి వైద్యం చేయడం రోగుల ఆరోగ్యానికి ప్రమాదకరమన్నారు. ఆర్‌ఎంపీలు డాక్టర్ అనే పదమే వాడకూడదని, కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే రోగులకు అందించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా దువ్వూరులో కొన్ని ఆస్పత్రుల పేరుతో రోగులకు మంచాలు, ఆక్సిజన్, అనుమతి లేని హెవీ యాంటిబయోటిక్స్ మందులను వాడుతూ మల్టీ స్పెషాలిటీ స్థాయిలో క్లినిక్ నిర్వహిస్తున్నారన్నారు. మండలంలో ఎక్కడైనా ఆర్‌ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు పెట్టి రోగులకు వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ సురేష్ బాబు, హెల్త్ సూపర్‌వైజర్లు రాజగోపాల్, శివగంగ రాజు, వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపులు భరించలేక భర్తను హతమార్చిన భార్య

ఆరునెలల తర్వాత విచారణలో వెలుగు చూసిన ఉదంతం


రామన్న (ఫైల్)


పూడ్చిపెట్టిన ప్రదేశంలో బయటపడిన ఎముకలు, దుస్తులు

మదనపల్లె రూరల్ : మద్యం తాగి గొడవపడడమేగాక, తనను కొడుతూ కూలి డబ్బులు లాక్కుని వెళ్లే భర్త వేధింపులను భరించలేని భార్య, తన తమ్ముడి సాయంతో హత్య చేసిన ఉదంతం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సంఘటన జరిగిన ఆరు నెలల తర్వాత పోలీసుల విచారణలో ఈ సంఘటన బయటపడింది. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. సత్యసాయిజిల్లా తనకల్లు మండలం నందివారిపల్లెకు చెందిన జరిపిటి రెడ్డెప్ప కుమారుడు రామన్న(40), భార్య రమణమ్మతో కలిసి ఉపాధి నిమిత్తం మదనపల్లెకు వచ్చాడు. రామారావుకాలనీలోని ఓ అద్దె ఇంటిలో నివాసముంటూ కూలి పనులుచేసి జీవనం సాగిస్తున్నారు. కొద్ది కాలం తర్వాత మద్యానికి బానిసైన రామన్న ఇంట్లో భార్యతో గొడవపడేవాడు. మద్యం తాగేందుకు అవసరమైన డబ్బులు భార్య నుంచి లాక్కునివెళ్లేవాడు. ఈ క్రమంలో మార్చి 12న మధ్యాహ్నం పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చిన రామన్న భార్యతో గొడవపడ్డాడు. అప్పటికే అతడి వేధింపులు భరించలేని ఆమె కర్రతో దాడిచేసింది. కిందపడిన అతడిపై రమణమ్మ తమ్ముడు ఈశ్వర్ రోకలిబండతో తలపై కొట్టాడు. దీంతో రెడ్డెప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. హత్య విషయం రాత్రివరకు గుట్టుచప్పుడు కాకుండా చూసిన రమణమ్మ, ఈశ్వర్ అనంతరం సంచిలో మృతదేహాన్ని మూటగట్టి బి.కొత్తకోట కస్తూర్బా స్కూల్ సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద పూడ్చిపెట్టారు. ఏమీ తెలియనట్లు తిరిగి ఇంటికి చేరుకున్నారు. తన అన్న కనిపించకపోవడంపై వదిన రమణమ్మ, ఆమె తమ్ముడు ఈశ్వర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెడ్డెప్ప సోదరుడు ఫిర్యాదుచేశాడు. సీఐ రాజారెడ్డి విచారించి వారిని అదుపులోకి తీసుకున్నారు. బి.కొత్తకోటలో పాతిపెట్టిన విషయాన్ని తెలుసుకుని అక్కడకు వెళ్లి పంచనామా చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ డా.ఆసాది శ్రీనివాసులు

రాజంపేట : భవిష్యత్తులో సాంకేతిక రంగంలో విప్లవాత్మకమార్పులు ఉంటాయని ఆస్ట్రేలియాలని కాలహాన్, న్యూ సౌత్‌వేల్స్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.ఆసాది శ్రీనివాసులు అన్నారు. ఏయూలో సీఎస్‌ఈ ఆధ్వర్యంలో ఎంఎల్,డీఎల్ సాంకేతికతో జనరేటివ్ ఏఐ అనువర్తనాలు అంశంపై అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో జనరేటివ్ ఏఐ ద్వారా కొత్త ఔషధాల రూపకల్పన, రోగ నిర్ధారణకు ఎక్స్‌రే, స్కాన్ ఇమేజీ ఆధారంగా ఖచ్చితమైన విశ్లేషణ చేయవచ్చునన్నారు. పరిశోధనలో భాగస్వామ్యం అవడానికి కావాల్సిన నైపుణ్యాలను అభివృద్ధి చేసేలా మార్గదర్శనం పొందాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌డీ స్కాలర్ జి. శ్రీనివాసులు, హెచ్‌ఓడి డా.ఎం.సుబ్బారావు, నవీన్‌కుమార్, బోధనాసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


రాయచోటి విద్యుత్తు కార్యాలయం ఎదుట రిలే దీక్షలు

రాయచోటి జగదాంబసెంటర్ : విద్యుత్ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ జేఏసీ చైర్మన్ జాఫర్‌వలి, కన్వీనర్ నరసింహులునాయక్, కో చైర్మన్ నరేంద్రనాథరెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి విద్యుత్ కార్యాలయం ఎదుట జిల్లా జేఏసీ, రాయచోటి, రాజంపేట డివిజన్ జేఏసీల ఆధ్వర్యంలో విద్యుత్తు కార్మికులు, సిబ్బంది శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. విద్యుత్ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి.. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రెడ్డప్పరెడ్డి, చంద్రశేఖర, జి.చంద్రశేఖర్, పాపయ్య, కె.వెంకటరమణ, మహేశ్వరయ్య, రియాజ్‌అహమ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

21న పుష్పగిరిలో ఉచిత సామూహిక పిండ ప్రదానం

వల్లూరు : పుష్పగిరిలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం సమీపంలో పవిత్ర పెన్నానది ఒడ్డున గల రుద్ర పాద ఆలయం వద్ద పితృదేవతలకు ఉచిత సామూహిక పిండ ప్రదానం నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు తెలిపారు. అత్యంత ప్రీతికరమైన మహాలయ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని పుష్పగిరి లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకే కార్యక్రమం మొదలవుతుందని, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని తెలిపారు. కుల మతాలతో సంబంధం లేకుండా ఎవరైనా తమ పితృదేవతలతో బాటు పరమపదించిన వారెవరికైనా పిండ ప్రదానం చేయవచ్చునని తెలిపారు. దేవస్థానం తరుపున పిండ ప్రధానానికి కావాల్సిన పసుపు, కుంకుమ, తమలపాకులు, వక్కలు, పూలు, అగరుబత్తీలు, కర్పూరము, ఇస్తర్లు, బియ్యంపిండి, నువ్వులు, దర్భ పవిత్రములు, తదితర సామగ్రి ఉచితంగా అందజేస్తారన్నారు. భక్తులు తమతో బాటు పంచ, టవలు, చెంబు, గ్లాసులు, ఉద్ధరేణి లేదా స్పూను, అర్ఘ్య పాత్ర లేక తట్ట తీసుకురావాల్సి వుంటుందని తెలిపారు. వాటితోబాటు ఉన్నవారు యజ్ఞోపవీతం తీసుకుని రావాల్సి వుంటుందని, అవకాశం వున్నవారు తేనె, ఆవు పాలు, బెల్లం, పూలు, పండ్లు తీసుకుని రావచ్చునని తెలిపారు.

ఎఫ్‌పీ షాపు ఆథరైజేషన్‌పై హైకోర్టు స్పందన

కడప సెవెన్‌రోడ్స్ : సింహాద్రిపురం మండలం రావులకొలను గ్రామ ఎఫ్‌పీ షాపు డీలర్ హరిత ఆథరైజేషన్ రద్దుపై రాష్ట్ర హైకోర్టు వివరణ కోరింది. పులివెందుల ఆర్డీఓ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎఫ్‌పీ షాపు డీలర్ హైకోర్టును ఆశ్రయించడంతో.. ఆ విధంగా కోర్టు స్పందించింది. డీలర్‌కు నాలుగు షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందో, ఇందుకు సంబంధించిన రికార్డులన్నింటినీ తీసుకుని శుక్రవారం తమ ఎదుట హాజరు కావాలని ఆర్డీఓను ఆదేశించింది.

ఎర్రచందనం దుంగలు పట్టివేత


ఎర్రచందనం దుంగలతో అటవీ అధికారులు


నిందితుడి అరెస్టు చూపుతున్న అటవీ అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు అటవీశాఖ పరిదిలోని కోడూరు రేంజ్ కేవీ భావి సౌత్ బీట్ వద్ద శుక్రవారం 24 ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా అధికారులు దాడులు చేసి పట్టుకొన్నారు. కోడూరు రేంజర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో శుక్రవారం కూంబింగ్ జరుపుతుండగా తమిళనాడు రాష్ట్రం కూనీక త్తూర్‌కు చెందిన వెంకటేశన్ దుంగలు తరలిస్తూ కనిపించాడు. అటవీ అధికారులు అతడిని అరెస్టు చేసి రూ.2.22 లక్షల విలువచేసే 24 దుంగలు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రమణ, మహేష్‌శంకర్, దామోదర్, పెంచలయ్య పాల్గొన్నారు.

తమిళనాడు వాసి అరెస్టు

పీలేరు : పీలేరు–యల్లమంద మార్గంలో అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ గురు ప్రభాకర్ తెలిపారు. వివరాలిలావున్నాయి ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో పీలేరు – యల్లమంద మార్గంలో అటవీ అధికారులు శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ఒక వాహనంలో రూ. 8.24 లక్షల విలువైన ఐదు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఒకరిని అరెస్టు చేసినట్లు డీఎఫ్‌వో తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఆర్‌వో చంద్రశేఖర్, ప్రకాష్‌కుమార్, ప్రతాప్, రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

ఐదు దుంగలు స్వాధీనం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : అన్నమయ్య జిల్లా రాజంపేట అటవీ ప్రాంతంలో ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒక స్మగ్లరును టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ ఎండీ షరీఫ్ సూచన మేరకు ఆర్ఐ కృపానంద, ఆర్ఎస్ఐ అల్లిబాషా, పోలీసులు రాజంపేట రోళ్లమడుగు ఫారెస్ట్ బీట్ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. శుక్రవారం ఉదయం పుట్టంగి మడుగు ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు తరలిస్తూ కంటపడ్డారు. టాస్క్ ఫోర్స్ టీమ్ వారిని చుట్టుముట్టే ప్రయత్నించగా వారు తప్పించుకున్నారు. వెంబడించిన టాస్క్ ఫోర్స్ పోలీసులు తమిళనాడుకు చెందిన ఒకరిని పట్టుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాస్ అతడిని విచారించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


పట్టుబడిన దుంగలు, స్మగ్లర్‌తో సిబ్బంది

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు


తీవ్రంగా గాయపడిన బాలుడు తరుణ్

మదనపల్లె రూరల్ : కుక్కల దాడిలో బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండ పంచాయతీ డ్రైవర్స్ కాలనీకి చెందిన మహేష్, గంగోత్రిల కుమారుడు తరుణ్(4) ఇంటి వద్ద ఆడుకుంటుండగా, వీధికుక్కలు ఒక్కసారిగా బాలుడిపై దాడిచేశాయి. దాడిలో బాలుడు తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఆలయ స్థలాలను పరిరక్షించుకుంటాం


స్థలాన్ని చదును చేయిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చిట్వేలి : ఆలయ స్థలాలను పరిరక్షించుకుంటామని చిట్వేలి సోమేశ్వరాలయం కమిటీ చైర్మన్ వీరాంజనేయులు, ఆర్గనైజర్ బొంతల నాగేశ్వరరావు, సభ్యులు మోహన్ అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, ధర్మనిధి అఖండ సభ్యుల ఆధ్వర్యంలో శివాలయం ఆవరణంలో ఆక్రమణకు గురైన స్థలాన్ని శుక్రవారం ఎక్సలేటర్లతో చదును చేయించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ అక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేసి పరిరక్షించుకుంటామన్నారు. ఎవరైనా స్థలాల ఆక్రమణకు పాల్పడితే సహించమన్నారు. ఈ కార్యక్రమంలో శివ, నాని, కొనిశెట్టి సుబ్బరాయుడు, కడుమూరి రమణయ్య, నవీన్, తేజ, మణి, సురేంద్ర, నరసింహ, వెంకటరత్నం, ,సాయి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

252 రేషన్ బియ్యం బస్తాల స్వాధీనం


మిట్టమీదపల్లిలో నిల్వ వుంచిన రేషన్ బియ్యం బస్తాలు

రాజంపేట రూరల్ : అక్రమంగా తరలించేందుకు మండలంలోని మిట్టమీదపల్లి గ్రామంలో ఉంచిన 252 రేషన్ బియ్యం బస్తాలను రెవెన్యూ అధికారులు బుధవారం గుర్తించారు. రాత్రి వరకు గోప్యంగా ఉంచి అనంతరం అసంపూర్తిగా ఉన్న ప్రెస్‌నోట్ విడుదల చేయడం అనుమానాలకు తావిస్తోంది. బుధవారం ఒక రోజే అటు 309 బస్తాలు లారీలో లభ్యం కావడం, ఇటు నిల్వ వుంచిన 252 బస్తాలు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.

పే కమిషన్ సభ్యుల పేర్లు ప్రకటించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న రైల్వే కార్మికులు

నందలూరు : 8వ పే కమిషన్ కమిటీ సభ్యులను కేంద్రం ప్రభుత్వం ప్రకటించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి విశ్వనాథ్ అన్నారు. రైల్వే కార్మికులతో కలిసి శుక్రవారం ఆయన నిరసన తెలిపారు. విశ్వనాథ్ మాట్లాడుతూ జనవరిలో 8వ పే కమీషన్ వేస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇంతవరకూ పేర్లను ప్రకటించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కన్నా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకే తక్కువ జీతాలు చెల్లిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం, ఆకులనాగరాజు, సాయి సందీప్, షేక్షావలి, సయ్యద్ గయాజ్, విశ్వదీపక్, శ్రీహర్ష, పి.రాజు, భరత్, లెనిన్ బాబు, పి.వెంకటేశ్వర్లు, అరుణ్‌కుమార్, సునీల్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

టర్పెంట్ ఆయిల్ తాగి చిన్నారి మృతి



మృతిచెందిన చిన్నారి అలీజా, టర్పెంట్ ఆయిల్ బాటిల్

మదనపల్లె రూరల్ : నీళ్లు అనుకుని టర్పెంట్ ఆయిల్ తాగి రెండేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన శుక్రవారం మదనపల్లెలో జరిగింది. కర్నాటకకు చెందిన సాదియా తన కుమార్తె అలీజా(2)తో కలిసి పట్టణంలోని సైదాపేటలో నివాసముంటోంది. నీరుగట్టువారిపల్లెలోని రీలింగ్ కేంద్రంలో పనులు చేస్తూ జీవిస్తోంది. శుక్రవారం పని ప్రదేశానికి కుమార్తెను తీసుకువెళ్లింది. ఆమె రీలింగ్‌కేంద్రంలో పనులు చేస్తుండగా, చిన్నారి ఆడుకుంటూ దప్పిక అవడంతో టర్పెంట్ ఆయిల్‌ను నీరు అనుకుని తాగింది. తీవ్ర అస్వస్థతకు గురికాగా, సాదియా, చిన్నారిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చింది. అత్యవసర విభాగంలో చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. మార్గమధ్యంలో పరిస్థితి విషమించి మృతి చెందింది.